క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రొంపిచర్ల ఇన్‌చార్జి ఎస్‌ఐ హజరత్తయ్య సోమవారం తెలిపారు. గత నెల 25వ తేదీ అర్ధరాత్రి నరసరావుపేట వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ మున్నా (24) ఈపూరులో నిర్వహించిన వివాహ ఈవెంట్ ముగించుకుని అతని స్నేహితురాలైన అశ్వినితో ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామ సమీపం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి మైలు రాయిని ఢీకొంది. సంఘటనలో అశ్విని అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ మున్నాను నరసరావుపేట పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శవ పంచనామ అనంతం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నరసరావుపేటలో....



నరసరావుపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాలేషావలి (27) వంటపనులు చేస్తూ ఉంటాడు. అవసరం కోసం వరవకట్టకు చెందిన వడ్డీ వ్యాపారి వద్ద రూ.5,000 అప్పుగా తీసుకున్నాడు. నగదు తిరిగి చెల్లించకపోవటంతో వడ్డీ వ్యాపారి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశాడు. దీంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఖాలేషావలి ఈ నెల 4వ తేదీన క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

వినుకొండ(నూజెండ్ల): ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన నూజెండ్ల మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు... బుర్రిపాలెం గ్రామానికి చెందిన యన్నాబత్తుని ఎర్రయ్య, ఏసమ్మల పెద్ద కుమారుడు మనేష్ (21) డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం ఉదయం మనేష్ తన ఇద్దరు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలో నూతనంగా తవ్విన బావిలో ఈతకు వెళ్లాడు. మనేష్ ప్రమాదవశాత్తు బావినీటిలో మునిగి మరణించాడు. స్థానికులు గమనించి యువకుడి మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. ాదఛాయలు అలుముకున్నాయి.

రైతు ఆచూకీపై ఫిర్యాదు

నాదెండ్ల: మతిస్థిమితం, అనారోగ్యంతో బాధపడుతున్న రైతు 6వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన రైతు బత్తుల ఐతంరాజు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. సుమారు ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడు. కుటుంబ సభ్యులు వైద్యుని సలహా మేరకు చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలోని బస్టాప్ వద్ద నుంచి నరసరావుపేట వెళ్లే పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో గుర్తించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

మరో ఇద్దరికి గాయాలు



యడ్లపాడు: ఆటో కోసం హైవే పక్కన నిలుచున్న మహిళలను బైక్ ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన సంఘటన యడ్లపాడు మండలం తిమ్మాపురంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపురం గ్రామం ఎస్సీకాలనీకు చెందిన జ్యోతి సునీత పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన సుబ్బారావుతో వివాహమైంది. వీరిద్దరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కొద్దికాలం కిందట భర్త చనిపోవడంతో పుట్టిల్లు తిమ్మాపురం వచ్చిన నివాసం ఉంటోంది. ఈ నేపథ్యంలో అత్తింటి వద్ద డ్వాక్రా గ్రూపులో ఉన్నందున సదరు గ్రూపు సభ్యులైన జొన్నలగడ్డ మరియమ్మ, ధర్నాసు చిన్నమ్మాయిలు డబ్బులు విషయం మాట్లాడేందుకు సోమవారం సాయంత్రం తిమ్మాపురంలోని జ్యోతి సునీత ఇంటికి వచ్చారు. వీరిని ఆటో ఎక్కించేందుకు సునీతతో పాటు అందరూ 16 నంబర్ హైవే లూథరన్ చర్చి సమీపంలో వసంత మిల్లు వైపు రహదారి పక్కన నిలుచున్నారు. అదే సమయంలో సొలసకు చెందిన యుగంధర్, ఉన్నవ వాసి హరీష్‌లు బైక్‌పై వేగంగా వచ్చి ఆటోకోసం వేచి చూస్తున్న మహిళల్ని ఢీకొట్టారు. దీంతో జ్యోతి సునీత (40) అక్కడికక్కడే మృతి చెందగా మరియమ్మ, చిన్నమ్మాయిలకు తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తర్వాత వచ్చిన 108 వాహనం మృతదేహాన్ని తీసుకోకపోవడంతో మృతురాలి బంధువులు ఆగ్రహంతో హైవేపై కొద్దిసేపు వాహనాల్ని నిలుపుదల చేశారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ సురేష్ సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను సరిచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించడంతో వివాదం సద్దు మణిగింది.

కంటి వైద్యశిబిరం



స్థానిక ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం చర్చి ఆవరణలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో నంద్యాలకు చెందిన శాంతిరాం మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కె.డేవిడ్, డాక్టర్ కె.దాసు, వారి సిబ్బంది పాల్గొని రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ సురభి జోసెఫ్, సెక్రటరీ బేతం గాబ్రియేలు మోజస్, ట్రెజరర్ నేలపట్ల శ్యామ్ వరప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కాల్వ సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

కుర్చీలు వితరణ



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన ప్రముఖ ఆర్‌ఎంపి వైద్యులు డాక్టర్ మెండు సత్యనారాయణ సోమవారం రూ.4 వేల రూపాయలు విలువ చేసే కుర్చీలు బహుకరించారు. ప్రధానోపాధ్యాయులు బియం సుభానీ మాట్లాడుతూ ఆర్‌ఎంపీ వైద్యులు డాక్టర్ మెండు సత్యనారాయణ పాఠశాలకు విద్యార్థులు సౌకర్యార్థం సైకిల్ స్టాండ్ నిర్మించారన్నారు. అనంతరం ఆర్‌ఎంపీ వైద్యులు డాక్టర్ మెండు సత్యనారాయణను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వై.సైదయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

–రొంపిచర్ల

జగనన్నతోనే మేమంతా..



విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభకు హాజరైన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ఫొటో: సాక్షి/విజయవాడ



తూబాడులో చిన్నారికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ధీరజ్



తూబాడులో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు, అధికారులు, నాయకులు



తూబాడులో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



రెడ్డినగర్‌లో రక్తపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొండవీడులో వృద్ధులకు మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

రోగినాడి పట్టి.. రోగం పనిబట్టి..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మేలు చేకూరుస్తోంది. నఖ–శిఖ పర్యంతం తమకు ఎదురవుతున్న రోగాలను రోగులు నిష్ణాతులైన వైద్యులకు వెల్లడిస్తున్నారు. తరుణోపాయం వారి ద్వారా తెలుసుకుని స్వాంతన పొందుతున్నారు. కొందరికి మందులతో ఆ వ్యాధులను నయం చేయవచ్చని సూచించి ఉచితంగా పరీక్షలు చేసి కావాల్సిన ఔషధాలను అందజేసి మరీ పంపిస్తున్నారు. మరికొందరిని ప్రధాన ఆస్పత్రులకు రిఫర్ చేసి అక్కడ మెరుగైన వైద్యం తీసుకోవాలని సూచిస్తున్నారు. మొత్తం మీద జగనన్న సురక్షతో వారికి ఆరోగ్య రక్ష దక్కుతోంది.

- వేర్వేరు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన
- తరలివచ్చి ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకుంటున్న జనం
- మంచి కార్యక్రమమంటూ కితాబు



కొండవీడు జేఏఎస్ క్యాంపునకు తరలి వచ్చిన జనం

రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రెడ్డిపాలెం ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో గ్రామానికి చెందిన 403 మందికి వివిధ వ్యాధులకు సంబంధించి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 192 మంది పురుషులకు 211 మంది స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 40 మంది పిల్లలు కూడా వైద్య పరీక్షలు నిర్వహించారు. 300 మందికి అవసరమైన ఈసీజీ, రక్త, యూరిన్ పరీక్షలు, ఐదు మందికి డెంగ్యూ పరీక్షలు నిర్వహించారు. 93 మందికి కంటి పరీక్షలు కూడా నిర్వహించి, వ్యాధి నిర్ధారణ చేశారు. అనంతరం 19 మందిని మెరుగైన చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. ఈ శిబిరంలో ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ మహేష్‌రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ పార్వతి, వైద్యాధికారులు డాక్టర్ స్వాతి, మురళి పాల్గొని వైద్యసేవలు అందించారు. ఆయా వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. సీత, ఎంపీటీసీ పి. వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

శానంపూడిలో ..

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు సారథ్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేవుడు ఇచ్చిన వరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొనపాటి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చెన్నంశెట్టి రంగారావు, తహసీల్దారు షేక్ జాన్ సైదులు, వైద్యాధికారులు వేముల వెంకట భాస్కర్, రాధాకృష్ణన్, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త బాజీబాబా, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఊరువాడా స్పెషల్ వైద్యం...

యడ్లపాడు: ఊరువాడా స్పెషల్ వైద్యం అందించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కొండవీడు గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అధికారులు ఏర్పాటు చేశారు. శిబిరంలో యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యులు ఎం.ప్రభాకరరావు, స్పెషలిస్టు డాక్టర్లు సాయి అమలేష్, ఎం.దీపిక, షేక్ నజీర్, ప్రదీప్ కుమార్‌లు హాజరయ్యారు. గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం ద్వారా కొత్తపాలెం, కొండవీడు గ్రామాలకు చెందిన 450 మంది ప్రజలకు ఓపీ రిజిస్ట్రేషన్ చేసి వివిధ రకాల పరీక్షలు, చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే 147 మందికి కంటి సంబంధిత సమస్యలపై పరీక్షలు చేశారు. మరో 19 మందికి మెరుగైన వైద్య పరీక్షలు, చికిత్స, సర్జీల నిమిత్తం పై ఆసుపత్రికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వై.హనుమారెడ్డి, ఈవోపీఆర్డీ వరూధిని, సర్పంచ్‌లు ఎంవీ సుబ్బారావు, మహమ్మద్ యూనీస్, ఎంపీటీసీ భ్యులు బి.శ్రీనివాసరావు, గ్రామపెద్దలు యండ్రపల్లి వెంకట్రావు, షేక్ జాకీర్, కట్టా ప్రసాదరావు, కార్యదర్శి పి.అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

తూబాడులో 698 మందికి వైద్య పరీక్షలు

నాదెండ్ల: ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఏపీలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలౌతున్నాయని, ఈ ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సొంతమని సర్పంచ్ గోళ్లమూడి కాశియ్య చెప్పారు. మండలంలోని తూబాడు సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నాదెండ్ల, గణపవరం పీహెచ్‌సీల వైద్యులు సాయిశ్వేత, కవిత అనసూయదేవితో పాటూ కాటూరి మెడికల్ వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ అవినీష్, డాక్టర్ ధీరజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా 698 మందికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందించారు. వీటితో పాటూ ఈసీజీ, వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. పలువురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి ఎంపికైనందున వారికి టోకెన్లు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ఆవశ్యకత, పలు ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగ మల్లేశ్వరరావు, ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, గణపవరం సొసైటీ అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, కనపర్రు సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు టీజే రత్తయ్య, బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, జెట్టి బొల్లయ్య, లూర్దురెడ్డి, సీతారామిరెడ్డి, వీరాస్వామి, రామకృష్ణ, నాదెండ్ల సొసైటీ మాజీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, దాట్ల విక్రంరాజు, పంచాయతీ కార్యదర్శి జరీనాబేగం, సీడీపీవో శాంతకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డినగర్‌లో ...

నరసరావుపేట రూరల్: రావిపాడు–2 గ్రామసచివాలయం పరిధిలోని రెడ్డినగర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి 566 మందికి హాజరై వైద్య సేవలు పొందారు. శిబిరానికి హాజరైన వారిలో 352 మంది మహిళలు, 214 మంది పురుషులు, 15 మంది విద్యార్థులు ఉన్నారు. కంటి సంభదిత సమస్యలతో బాధపడుతున్న 136 మందికి పరీక్షలు నిర్వహించి 52 మందికి కళ్లజోళ్ల అవసరమని సూచించారు.

కోటప్పకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందకుమార్, డాక్టర్ బి.జోయల్ ప్రసాద్, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ జి.లక్ష్మీ, డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డిలు వైద్య సేవలు అందించారు. తహసీల్దార్ రమణానాయక్, ఈఓపీఆర్‌డీ విజయకుమార్, రావిపాడు పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, రెడ్డినగర్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోటపాటి రవీంద్రా రెడ్డిలు ఏర్పాట్లు పర్యవేక్షించారు. వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వాతి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మహేష్



తూబాడులో పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్



శానంపూడిలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య



రెడ్డినగర్‌లో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు డాక్టర్ నందకుమార్



రెడ్డినగర్‌లో మహిళకు బీపీ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కొండవీడులో జేఏఎస్ క్యాంపులో ప్రజలకు ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఎంత సాగు చేస్తున్నారు?

- అంతర్ పంటలు ఏమి వేశారు?
- సాతులూరులో రైతులతో మాట్లాడిన కలెక్టర్ శివశంకర్
- పత్తి, మిర్చి సాగు పరిస్థితులపై ఆరా



పత్తి పంట సాగు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్, పక్కనే ఏడీఏలు

నాదెండ్ల: ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగవుతున్న పంటలను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం పరిశీలించారు. సాతులూరు గ్రామంలోని పత్తి, మిర్చి పంటలు పరిశీలించారు. రైతుల తో మాట్లాడారు. ప్రస్తుత పంట పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు గడ్డం శివాజి పత్తి, కంది అంతర్ పంటను 3:1 నిష్పత్తిలో సాగు చేస్తున్న అంతర్ పంటలు పరిశీలించి, సాగు విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళవారం లోగా జిల్లా వ్యాప్తంగా ఈక్రాప్ నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ సచివాలయాల్లో ఈకేవైసి చేయించుకోవాలన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నందున పత్తి సాగు గణనీయంగా తగ్గిందని, ఈ మేరకు మిర్చి సాగు పెరిగిందని, స్థానిక వ్యవసాయాధికారి ఎ హరిప్రసాద్ వివరించారు. ప్రస్తుతం పత్తిలో అక్కడక్కడ గులాబీరంగు పురుగు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, పత్తి రైతు ఎకరాకు 10 తగ్గకుండా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు మస్తానమ్మ, శివకుమారి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు వేణుగోపాల్, రామారావు, కోటంరాజు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి రోల్‌ప్లే, ఫోక్‌డాన్స్ పోటీలు

యడ్లపాడు: జిల్లాస్థాయి రోల్‌ప్లే, ఫోక్‌డాన్స్ పోటీలను ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌ఎం సుభాని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూల్స్‌లో 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చన్నారు. బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. మరిన్ని వివరాలకు డైట్ లెక్చరర్ 97047 90917లో సంప్రదించాలని కోరారు.

బీఎస్సీ, బీకాంలలో స్పాట్ అడ్మిషన్లు

వినుకొండ టౌన్: బీఎస్సీ, బీకాంలలో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 13 వరకు స్వీకరిస్తున్నట్లు రాధా డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.వి.రాధాకృష్ణమూర్తి సోమవారం తెలియచేశారు. చేరబోయే విద్యార్థులు 13వ తారీకు సాయంత్రం 5 గంటలలోపు పట్టణంలోని సిద్ధార్థ నగర్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద గల రాధా డిగ్రీ కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9059098426, 9701286012, 9440163917 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ప్రారంభమైన జాతీయ తపాలవారోత్సవాలు

నరసరావుపేట టౌన్: ప్రపంచ తపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాల శాఖ ఆధ్వర్యంలో తపాల సేవలు ప్రజలకు మరింత చేరువ చేస్తూ 9 నుంచి 13వ తేదీ వరకు జాతీయ తపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి సోమవారం తెలిపారు. మొదటి రోజు వరల్డ్ పోస్ట్ డే, రెండవ రోజు సేవింగ్స్ బీమా, మూడవ రోజు వివిధ రకాల స్టాంపుల సేకరణ, నాల్గవ రోజు మెయిల్స్ పార్సిల్స్ డే, ఐదవ రోజు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు సేవలు, డీబీటీ ద్వారా పోస్టాఫీస్ ద్వారా చెల్లింపులపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు.